# నమస్తే తెలంగాణ

## ములుగు
## జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, బుధవారం 12 ఫిబ్రవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




మాజీ సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకుడు మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

# ఉప ఎన్నిక ఖాయం
# మళ్లీ ఎమ్మెల్యే నువ్వే

- రాజయ్యను దీవించిన కేసీఆర్
- బీఆర్‌ఎస్ అధినేతను కలిసిన మాజీ ఎమ్మెల్యే తాటికొండ
- సొంత గూటికి ధర్మసాగర్ మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి
- 15న కేటీఆర్ సమక్షంలో వెయ్యి మందితో చేరికలు : రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్/వేలేరు, ఫిబ్రవరి 11 : స్టేషన్ ఘన్‌పూర్ ఉప ఎన్నిక ఖాయమని పార్టీ మారిన ఎమ్మెల్యేలకు తెలంగాణ ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని.. ఆ ఎన్నికలో కడియం శ్రీహరి ఓడిపోయి రాజయ్య ఎమ్మెల్యేగా గెలుస్తారని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. మంగళవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే రాజయ్యతో పాటు ఉమ్మడి ధర్మసాగర్ మాజీ జడ్పీటీసీ, వేలేరు గ్రామానికి చెందిన కీర్తి వెంకటేశ్వర్లు, వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి సుమారు వెయ్యి మందితో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పుకోనున్నట్లు తెలిపారు. కాగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ టికెట్ కడియం శ్రీహరికి ఇవ్వడంతో అసహనంతో వెంకటేశ్వర్లు, రాజేశ్వర్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరి ఇప్పుడు సొంత గూటికి వచ్చినట్లు తెలిపారు. త్వరలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉపఎన్నిక వస్తుందని మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేసీఆర్ చెప్పినట్లు పేర్కొన్నారు. అక్రమ కేసులతో 15 రోజులుగా జైల్లో ఉన్న నియోజకవర్గ బీఆర్‌ఎస్ కో ఆర్డినేటర్ కేతిరెడ్డి మనోజ్‌రెడ్డికి కేసీఆర్ ధైర్యం చెప్పి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారని రాజయ్య తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కడియం శ్రీహరి ఆగడాలు, నియోజకవర్గ పరిస్థితులను కేసీఆర్‌కు వివరించినట్లు తెలిపారు.




మినీ జాతరకు సిద్ధమైన మేడారంలోని సమ్మక్క పూజా మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మ పూజా మందిరం

# మినీ జాతరకు వేళాయె

## మేడారంలో నేడు మండెమెలిగే పండుగ

తాడ్వాయి, ఫిబ్రవరి11: ప్రతి రెండేళ్లకోసారి జరిగే అమ్మవార్ల మహాజాతర అనంతరం వచ్చే ఫిబ్రవరిలో మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని మేడారం, కన్నెపల్లిలో సమ్మక్క, సారక్క పూజారులు ఆయా పూజా మందిరాల్లో మండెమెలిగే పండుగను నిర్వహిస్తారు. ఈ మేరకు బుధవారం జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పూజారులు ఆయా గ్రామాల్లో డోలివాయిద్యాల నడుమ గ్రామదేవత, బొడ్రాయిల వద్ద ప్రత్యేక పూజలు చేసి, అనంతరం దుష్టశక్తులు గ్రామంలోకి రాకుండా బురుకు కట్టెలతో గ్రామ పొలిమేరలో మామిడి ఆకులతో పాటు కోడి పిల్లతో తోరణాలు కడతారు. అనంతరం పూజారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు సమ్మక్క-సారక్కల పూజా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవార్ల మినీ జాతర ముగిసే వరకు సమ్మక్క, సారక్క ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణయ్య, కాక సార య్య అత్యంత నియమనిష్టలతో తల్లులకు పూజలు నిర్వహిస్తారు. బుధవారం రాత్రంతా గద్దెల వద్ద జాగారం చేసి అనంతరం ఒకరికి ఒకరు సాకను ఇచ్చిపుచ్చుకుంటారు. దీంతో మినీ జాతర ప్రారంభమవుతుంది. తల్లులను గద్దెల మీదకు తీసుకురావడం మినహా మహాజాతర సందర్భంగా అమ్మవార్లకు జరిగిన పూజా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయి. బుధ, గురు, శుక్ర వారాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్న అనంతరం అమ్మవార్ల పూజా సామగ్రిని శుద్ధి చేసిన అనంతరం గుడిలో భద్రపరచడంతో మినీ జాతర ముగుస్తుంది.

**వివిధ మార్గాల నుంచి వచ్చే వారికి రూట్ల కేటాయింపు**

ములుగు రూరల్: మినీ మేడారం జాతరకు వివిధ మార్గాల నుంచి వచ్చే భక్తులకు రోడ్డు మార్గాలతో పాటు రూట్లను కేటాయించినట్లు ఎస్పీ పీ శబరీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి వచ్చే భక్తుల కోసం ఒక రూట్, భూపాలపల్లి, కరీంనగర్ మీదుగా రెండో రూట్, ఏటూరునాగారం, కొత్తగూడెం మీదుగా మూడో రూట్, ఆర్టీసీ బస్సుల ద్వారా పస్రా, తాడ్వాయి మీదుగా వచ్చే భక్తుల కోసం 4వ రూట్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీవీఐపీ భక్తుల కోసం శ్రీరాంసాగర్ చెరువు పక్కన పార్కింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

## మూడు రోజులు ఆర్టీసీ స్పెషల్ బస్సులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 11: ఈనెల 12, 13, 14వ తేదీల్లో సమ్మక్క-సారలమ్మ మినీ మేడారం జాతర జరుగుతున్న నేపథ్యంలో బస్సుల సౌకర్యార్థం ఆర్టీసీ వరంగల్ రీజియన్ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్‌ఎం డీ విజయభాను తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఉదయం 6 గంటల నుంచి మేడారానికి బస్సులు నడుపుతున్నట్లు, ప్రత్యేక బస్సుల ఆపరేషన్ నిర్వహణకు హనుమకొండ, మేడారం బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అన్ని ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో మహిళలు, ఆడపిల్లలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని, ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. జాతర బస్సుల చార్జీలు ఎక్స్‌ప్రెస్ రూ.200(పెద్దలు), రూ.110( పిల్లలు), ఈ-ఎక్స్‌ప్రెస్ రూ.210(పెద్దలు), రూ. 120( పిల్లలు) ఉంటుందని ఆర్‌ఎం తెలిపారు.

# భక్తుల భద్రత పట్టదా?

## జంట వంతెనలకు రెయిలింగ్ ఏర్పాటు చేయని అధికారులు



రెయిలింగ్ ఏర్పాటు చేయని జంట వంతెనలు

తాడ్వాయి, ఫిబ్రవరి11: మేడారం మినీ జాతరలో భాగంగా అమ్మవార్లను దర్శించుకునేందు కు వచ్చే భక్తుల భద్రతను అధికారులు మరిచినట్లు కనబడుతున్నది. సుమారు 40లక్షల మంది భక్తులు వస్తారని మంత్రులతో పాటు జిల్లా అధికారులు ప్రకటించారు. ప్రైవేట్ వాహనాలు ఎక్కువగా జంపన్న వాగు వంతెన మీదుగానే మేడారానికి చేరుకుంటాయి. అక్కడే పుణ్యస్నానాలు ఆచరించడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు పలుమార్లు వాహనాలు వాగులో పడి పోయాయి. అయినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు జంపన్నవాగుపై వంతెనకు రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో పాటు ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టలేదు. లైటింగ్ కూడా సమకూ ర్చలేదు. భక్తుల భద్రత కోసం అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

# జాతర పరిసరాల్లో కానరాని మరుగుదొడ్లు

## భక్తులు కాలకృత్యాలు తీర్చుకునేదేలా?

### కాలుష్యమయం కానున్న మేడారం, పరిసర గ్రామాలు

తాడ్వాయి, ఫిబ్రవరి11: అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకార్యర్థం జాతర పరిసరాల్లో మరుగుదొడ్లు కానరావడం లేదు. దీంతో మేడారం వచ్చే భక్తులు కాలకృత్యాలు ఎలా తీర్చుకోవాలనేది ప్రశ్నార్థకంగా మారింది. జాతరకు రూ. కోట్లు వెచ్చించి సౌకర్యాలు కల్పించామని చెబుతున్న ప్రభుత్వం, అధికారులు ఒక్క మరుగుదొడ్డిని కూడా ఏర్పాటు చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్, గద్దెల వెనకభాగం, సారలమ్మ ఓట్‌గేట్ సమీపంలో, జంపన్నవాగు వద్ద సులభ్ కాంప్లెక్స్‌లు ఉండగా, ఐటీడీఏ క్యాంపు కార్యాలయం సమీపంలో మరో మినీ సులభ్ కాంప్లెక్స్ ఉంది. వీటిలో సుమారు 40 దాకా మరుగుదొడ్లు ఉన్నాయి. మినీ జాతరకు సుమారు 40 లక్షల మంది భక్తులకు ఈ టాయిలెట్లు సరిపోతాయా అనేది అధికారులకే తెలియాలి. అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులు ఎక్కువగా చిలకలగుట్ట, శివరాంసాగర్ చెరువు, కొంగళమడుగు, కొత్తూరు. రెడ్డిగూడెం, కాల్వపల్లి చెక్‌పోస్టుల వద్ద విడిది చేస్తారు. ప్రస్తుతం అధి కారులు ఈ ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయకపోవడంతో వారంతా బహిరంగంగానే మల మూత్రవిసర్జన చేసే అవకాశం ఉంది. మామూలుగానే జాతరలో కోళ్లు, మేకల వ్యర్థాలతో దుర్వాసన కొడుతుంది. ఇప్పుడు మలమూత్ర విసర్జనలతో మేడారంతో పాటు గ్రామాలు కాలుష్యమయం కానున్నాయి.

భూగర్భ జలాలు అడుగంటి పొలాలు ఎండిపోతున్నాయి. సాగునీళ్లు అందక బీటలు వారుతున్న పంటలను చూసిన రైతులకు కన్నీళ్లే దిక్కవుతున్నాయి. రిజర్వాయర్లలో నీళ్లున్నా విడుదల చేయకపోవడంతో రైతులకు నీళ్లు రాక ఎండిపోయి వరి చేలల్లోకి పశువులను మేత వదలాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా పాలకుర్తి నియోజకవర్గంతో పాటు చాలాచోట్ల 500 ఫీట్ల వరకు బోర్లు వేసినా నీళ్లు రాని దుస్థితి నెలకొంది. సమైక్య రాష్ట్రంలో బీళ్లుగా మారిన పంట పొలాలు స్వరాష్ట్రంలో కేసీఆర్ చొరవతో పచ్చగా మారి కోనసీమను తలపించగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో మళ్లీ ఎనకటి రోజులే దాపురించాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగునీళ్లు లేక అల్లాడుతున్న రైతులు కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటూ ఈ కరువు పరిస్థితులు ఎప్పుడు పోతాయోనని ఎదురుచూస్తున్నారు.

- పాలకుర్తి/దేవరుప్పుల/జనగామ రూరల్/పర్వతగిరి, ఫిబ్రవరి 11




ఓబుల్ కేశ్వాపూర్‌లో ఎండిపోయిన చెరువు



జనగామ రూరల్: సిద్దెంకిలో నీళ్లులేక బీటలు వారిన ముస్త్యాల వెంకటయ్యకు చెందిన వరిపొలం, (ఇన్‌సెట్) పంటను మేస్తున్న ఆవు

## మూడెకరాలు ఎండిపోయింది



నాకు 4.20 ఎకరాలు భూమి ఉంది. అందులో 3.20 ఎకరాల్లో వరినాటు వేసిన. 20 గుంటల మేర నీరు పారుతుండగా మిగిలిన మూడెకరాలు ఎండిపోయింది. గతంలో నాటు పెట్టిన పొలం ఎప్పుడూ ఎండిపోలేదు. పక్కనే గోదావరి కాల్వ ద్వారా నీరు రావడంతో పొలం మొత్తం నాటు వేసెటోళ్లం. నాకు రెండు బోర్లున్నాయి. అందులో ఒకటి ఎండిపోయింది. మరో బోరు నీటిని పశువులకు, తాగునీటికి వాడుకొని మిగతాది పొలానికి పారిస్తున్నా. ఇప్పటికైనా కాల్వల ద్వారా సాగునీరందించి రైతులను ఆదుకోవాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు పంటలు ఎండిపోకుండా చూడాలి. - పొన్నాల ప్రభాకర్‌రెడ్డి, రైతు, పెద్దరాంచర్ల, జనగామ



దేవరుప్పుల: బీటలువారిన భూమిని చూపుతున్న రైతు వెంకన్న

# అడుగంటిన జలాలు
# ఎండుతున్న పొలాలు

- మళ్లీ పాత రోజులొచ్చాయని రైతుల ఆవేదన
- కాల్వ నీటిని విడుదల చేయని అధికారులు
- వెయ్యి ఫీట్లు బోరు వేసినా రాని చుక్కనీరు
- గ్రామాల్లో చక్కర్లు కొడుతున్న బోరు బండ్లు
- కేసీఆర్ పాలనలో నీళ్లకు రంది లేకుండెనంటున్న అన్నదాతలు

## రైతన్నకు తప్పని కన్నీళ్లు

జనగామ జిల్లా పాలకుర్తి మండలం అంతటా బోర్లు భూగర్భ జలాలు లేక అడుగంటుతున్నాయి. నీళ్లు లేక వరి పొలాలు బీటలు వారుతున్నాయి. మండలకేంద్రానికి చెందిన చెవ్వ సోమయ్యకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉండగా, ఎకరన్నరంలో వరి వేశాడు. అర ఎకరంలో కూరగాయలను సాగు చేశాడు. సాగునీటి కోసం రెండు బోర్లు వేశాడు. గతేడాది ఓ బోరు 350 ఫీట్లు వేయగా, ఈ ఏడాది 550 ఫీట్ల వరకు వేశాడు. రెండు బోర్లలో నీళ్లు పడలేదు. దీంతో తాను వేసిన ఎకరన్నర వరి పొలం బీటలు వారి ఎండుతున్నది. కూరగాయల పంట కూడా ఎండిపోతుండడంతో సోమయ్య కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. గతంలో పదేళ్ల క్రితం పంటలు ఎండి కరువును చూశాం. ఈ ఏడాది కూడా పంటలు పండక కరువును చూస్తున్నాం. భూగర్భ జలాలు అడగంటడడంతో బోర్లలో చుక్క నీరు లేని పరిస్థితి దాపురించింది. ఎర్రబెల్లి దయాకర్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంతమంతా సస్య శ్యామలంగా ఉండేదని రైతులు చెబుతున్నారు. అలాగే దేవరుప్పుల మండలం సీతారాంపురం జటంగి కుంట కింద రైతుల వరి పొలాలు నెర్రెలు బారుతున్నాయి. కుంటలో నీరు లేక భూగర్భజలాలు పూర్తిగా అడుగంటాయి. బోర్లు కొన్ని సెకండ్ల వరకే నీళ్లు పోస్తున్నాయి. దేవాదుల నీరు విడుదల చేసి చెరువులు నింపుతారన్న నమ్మకంతో వరినాట్లు పెట్టామని, తీరా నీరు రాక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. నవంబర్ నెలలో నీరు వదలగా చెరువులకు చేరిందని, దీంతో బోర్లు పోశాయని, అదే నమ్మకంతో యాసంగి వరి నాట్లు వేసినట్టు ఆయకట్టుదారులు తెలిపారు. తీరా ఫిబ్రవరి వచ్చినా నీరు వదలకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదన్నారు. చెరువు కింద 60 ఎకరాల తరి ఆయకట్టు ఉండగా, బోర్లు అడుగంటి పెట్టిన కాడికి ఎండే పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపితే కొన్ని పంట పొలాలైనా చేతికి వస్తాయని, ఆలస్యమైతే పుట్టి మునుగుడేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

## కేసీఆర్ హయాంలో కోనసీమే..

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాల్వలు తవ్వి గోదావరి జలాలు విడుదల చేయడంతో మండు వేసవిలోనూ చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకేవి. వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంల్లో ఏడాదంతా పుష్కలంగా నీరుండేది. ఫలితంగా భూగర్భ జలాలు పెరిగి బావులు, బోర్లు నీటితో కళకళలాడేవి. దీంతో భూములన్నీ పచ్చని పొలాలతో కోనసీమను తలపించేవి. రిజర్వాయర్లు, చెరువుల నిండా నీళ్లుండడంతో రైతులు పడావు పడ్డ భూములను సైతం సాగులోకి తీసుకొచ్చి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చి ఇక్కడ పనులు చేసేవారు. కాంగ్రెస్ సర్కారులో ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. ఎక్కడి పొలాలు అక్కడే పంటలు సాగుచేయక మళ్లీ పడావుగా మారి తెలంగాణ రాక ముందటి రోజులను తలపిస్తున్నాయి.

## కాపాడుకునేందుకు అరిగోస

రైతులు వరి నాట్లు వేసే సమయంలో బోరు బావులు, బావుల్లో నీరుంది. పంట చేతికొచ్చే సమయం వరకు నీరు సరిపోతుందని, కాల్వల ద్వారా గోదావరి జలాలు విడుదల చేస్తారనే నమ్మకంతో సాగు మొదలుపెట్టారు. బోరు బావులు అడుగంటి, కాల్వల నీరు వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఒకవైపు వరినాట్లు వేస్తుండగా, మరోవైపు వేసినవి ఎండిపోతున్నాయి. రైతు భరోసా రాక, పూర్తిగా రుణమాఫీ కాక అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు అరిగోస పడుతున్నారు. 800 నుంచి వెయ్యి ఫీట్ల లోతు వరకు బోర్లు వేసినా చుక్క నీరు బయటకు రావడం లేదు. అప్పులు తెచ్చి రైతులు బోర్లు వేస్తుండడంతో మరింత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారా గోదావరి జలాలను అధికారులు విడుదల చేయకపోవడంతో వరి పొలాలకు నీరందక, బోరు బావులు అడుగంటి పంటలు కళ్లముందే ఎండిపోతున్నా కాపాడుకోలేక రైతులు కన్నీరు పెడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకొని కాల్వల ద్వారా నీరు విడుదల చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. జనగామ మండలంలోని పెద్దరాంచర్ల, సిద్దెంకి, పెద్దపహాడ్, ఎర్రకుంట తండా, ఎల్లంల, పెంబర్తి ఓబుల్‌కేశ్వాపూర్, చౌదర్‌పల్లి గ్రామాల్లో పంటలు ఎండిపోతుండడంతో రైతులు వాటిని జీవాలకు వదిలేస్తున్నారు. సిద్దెంకిలో జన్నె రాములు, ముస్త్యాల వెంకటయ్య, కేమిడి లక్ష్మయ్య, రాగుల నర్సయ్య, బిట్ల రవీందర్‌రెడ్డి, పెద్దరాంచర్లకు చెందిన పొన్నాల ప్రభాకర్ రెడ్డి, పలు గ్రామాల రైతులు వరి పంటలో పశువులను మేపుతున్నారు.



పర్వతగిరి: భూగర్భ జలాలు అడుగంటడంతో ఎండిన పంట

## చెరువుల నీళ్లుంటెనే బోర్లు పోస్తయ్..



జటంగి కుంటల నీళ్లు ఉంటేనే బోర్లు పోస్తయ్. పంటలు పండుతయ్. నవంబర్ నెలలో దేవాదుల నీరు వదిలి రైతులకు ఆశ చూపిండ్రు. చెరువులకు నీళ్లొచ్చుడు తోని యాసంగి నాట్లు పెట్టిండ్రు. మళ్ల ఒకసారి చెరువులు నింపితెనే వడ్లు పండుతయ్. లేకపోతె పొలాలు ఎండుతయ్. నీళ్ల వస్తాయన్న భరోసాతోనే పొలం దున్నిన. బోర్లు ఆగి పోసుడుతోని దున్నిన మళ్లు ఎండబెట్టిన. రెండెకరాలు పారుతదని నాటేస్తె అది కూడా ఎండుతున్నది. ఇవ్వాళ, రేపట్ల చెరువులకు నీళ్లొస్తె ఒడ్లు పండినట్టు.. లేకపోతే ఎండినట్టే..

– బస్వ వెంకన్న, రైతు, జటంగికుంట ఆయకట్టుదారు, దేవరుప్పుల మండలం

## ఎమ్మెల్యే గారూ... మీ హామీ ఏమైంది?

ఎగువ నుంచి నీరు రాక, ఎస్‌ఆర్‌ఎస్పీ అధికారుల నిర్లక్ష్యం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు బీడుబారుతున్నాయి. వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట నుంచి పారే ఆకేరు వాగుతోపాటు, ఎస్‌ఆర్‌ఎస్పీ కాలువ నీరు కొత్తపల్లి, ల్యాబర్తి, మీదుగా రావూరు, కల్లెడ శివారు తండాలలో చెరువులు, కుంటలు చెక్ డ్యాంలు నిండుతుండబంతో దిగువనకు నీరు నిరంతరాయంగా పారేది. దీంతో ఆకేరు వాగు సమీపంలోని చెరువులు, కుంటలకు రావూరు, కల్లెడ, గుగులోతుతండా, మోత్యాతండా, సీత్యాతండా, రోళ్లకల్, నారాయణపురం, బూరుగుమడ్ల, దూపతండాల్లో ఇంతకాలం భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేవి. కానీ యాసంగిలో ఆకేరు వాగు ఎండిపోవడం, ఎస్సారెస్పీ నీళ్లు వదలకపోవడంతో చెరువులు, కుంటలు, వాగుల్లో నీరు లేక చుట్టుపక్కల బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. సుమారు 600 ఎకరాల్లో నీళ్లు లేక వరి పంట ఎండిపోయే పరిస్థితి వచ్చింది. రైతులు తమ పంటలు ఎండిపోతున్నాయని స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, అధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ సుమారు రెండు నెలలు గడుస్తున్నా ఆచరణలోకి రాకపోవడంతో దిగులు చెందుతున్నారు.

## కండ్ల ముందే వరి పొలం ఎండుతున్నది



రెక్కాడితే డొక్కాడని బతుకులు మావి. వ్యవసాయం చేస్తేనే కడుపులోకి నాలుగు మెతుకులు.. కండ్ల ముందే పంటలు ఎండుతున్నాయి. గుండెలు అవిసిపోతున్నాయి. నాకు రెండు ఎకరాల భూమి ఉంది. ఎకరన్నరలో వరి, అర ఎకరంలో కూరగాయలు వేశాను. నాకు రెండు బోర్లు ఉన్న వి. ఓ బోరు 550 ఫీట్లు, ఇంకో బోరును 350 ఫీట్లు వేశాను. రెండు బోర్లలో చుక్కా నీరు లేదు. కండ్ల ముందు వరి పొలం ఎండుతుంటే కన్నీళ్లు ఆగడం లేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా, దయాకర్‌రావు ఉన్నప్పుడు గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నిండాయి. బోర్లల్లో ఫుల్ నీళ్లు ఉండేవి. సక్కని దేవుణ్ని పోగొట్టుకున్నాం. కష్టాలు పడుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. కరువు వచ్చింది. చెరువులు కుంటలు ఎండాయి. బోర్లలో నీళ్లు లేకుండా పోయాయి. వరిపోతే ఉరి తప్పదు. ప్రభు త్వం ఇప్పటికైనా గోదావరి జలాలు విడుదల చేయాలి.

– చెవ్వ సోమయ్య రైతు, పాలకుర్తి

## ఎమ్మెల్యే హామీ అమలు కాలేదు



ఆకేరు వాగు ఎగువ నుంచి సాగు నీళ్లు రావడం లేదు. పంటలు ఎండిపోతున్నాయని స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి గతేడాది డిసెంబర్ 25న తీసుకెళ్లాం. మూడు రోజుల్లో పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు పరిష్కారానికి నోచుకోలేదు.

– దొమ్మాటి లక్ష్మీనారాయణ, రైతు, రావూరు



పాలకుర్తి పరిసరాల్లో నీళ్లు లేక ఎండుతున్న వరి పొలం

## మా గోస ఎవ్వరికీ పట్టడం లేదు



సాగు నీటి ఇబ్బందులు ఎదురైతే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మా గోస ఎవ్వరికి పట్టడం లేదు. చూస్తాం. చేస్తామంటున్నారు. కానీ ఇంత వరకు చుక్కా నీరు పైనుంచి విడుదల కాలేదు. దీంతో పంటలు బీళ్లుగా మారుతున్నాయి.

– బానోత్ కోట నాయక్, రైతు, మోత్యా తండా

# వరంగల్, జనగామ మార్కెట్ల కార్యదర్శులు సస్పెన్షన్

## అవకతవకల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 11 : వరంగల్ ఎనుమాముల, జనగామ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శులు పోలెపాక నిర్మల, సంగినేని శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ఉదయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురిని సస్పెండ్ చేయగా, అందులో వరంగల్, జనగామ కార్యదర్శులున్నారు. అక్టోబర్ నుంచి సీసీఐ ఆధ్వర్యంలో మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వ్యవసాయ అధికారులు జారీ చేసిన టీఆర్ సర్టిఫికెట్లలో అవకతవకలు జరుగడంతో ప్రభుత్వం వీరిపై వేటు వేసినట్లు తెలిసింది. జనగామ మార్కెట్ పరిధిలో 4,500, వరంగల్‌లో 176 టీఆర్ సర్టిఫికెట్లలో తేడాలున్నట్లు తెలిసింది. కాగా నర్సంపేట మార్కెట్ సెక్రటరీ జీ.రెడ్డికి వరంగల్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

# పాత స్టాక్.. కొత్త రేట్..

- వేసవికి ముందే పిరమైన బీర్లు
- 15 శాతం పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం
- కొత్త ధరలతో పాత స్టాక్ విక్రయం
- నిర్వాహకులతో గొడవకు దిగిన మద్యం ప్రియులు
- మధ్యాహ్నం వరకు పలుచోట్ల వైన్స్ మూసివేత

సుబేదారి/గోవిందరావుపేట, ఫిబ్రవరి11 : మద్యం ప్రియులపై రాష్ట్ర ప్రభుత్వం భారం మోపింది. రేట్లు పెంచడంతో వేసవికి ముందే చల్లని బీర్లు వేడి పుట్టిస్తున్నాయి. అన్ని బ్రాండ్లపై గరిష్ట ధరపై 15శాతం అదనంగా పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో అన్ని రకాల బీర్ల రేట్లు రూ. 20 నుంచి రూ. 30కి పైగా పెరిగాయి. కేఎఫ్ లైట్ బీర్ రూ. 150 ఉండగా ప్రస్తుతం రూ.172.50కు విక్రయిస్తున్నారు. కేఎఫ్ ప్రీమియం రూ.160, రూ. 184, కేఎఫ్ అల్ట్రా రూ. 210 నుంచి రూ.241.5, ఇలా అన్నింటి ధరలు పెంచి అమ్ముతున్నారు. దీనికి తోడు బెల్ట్ షాపుల్లో సైతం కొత్త రేట్లపై ఒక్కో బీరుకు రూ. 30 నుంచి రూ. 40 వరకు అదనంగా పెంచి విక్రయిస్తున్నారు.

**పాత సరుకుపై అయోమయం**

కొత్త ధరల అమలు విషయంలో ఎక్సైజ్ శాఖ నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఆదేశాలు రాకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 294 వైన్స్ ఓనర్లు అయోమయంలో పడ్డారు. కొన్ని చోట్ల షాపులను మధ్యాహ్నం 3 గంటల వరకు తెరవలేదు. కొన్ని ప్రాంతాల్లో పాత రేట్లకు, మరి కొన్ని చోట్ల కొత్త ధరలతో విక్రయించారు. అయితే పాత స్టాక్‌ను కొత్త రేట్లకు ఎలా విక్రయిస్తారంటూ మద్యం ప్రియులు షాపుల నిర్వాహకులతో గొడవకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకు 4.50 లక్షల బీర్ పెట్టెల విక్రయాలు జరుగుతాయి. జనవరిలో 4,49,672 బీర్ పెట్టెలు అమ్ముడైనట్లు ఎక్సైజ్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కన వేసవిలో రోజుకు సగటున 40 వేల నుంచి 50 వేల బీర్ పెట్టెల అమ్మకం జరగనున్నట్లు అధికారులు తెలిపారు.




చల్వాయిలో మూసి ఉన్న మద్యం దుకాణం